e-paper

# ఈ -కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

బుధవారం | 19-2-2025 | హైదరాబాద్ | e-kaburu.com


శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు మాఘ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:44 సూర్యాస్తమయం - సా. 6:15 తిథి షష్ఠి ఉ. 7:33 వరకు తరువాత సప్తమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం స్వాతి ఉ. 10:32 వరకు తరువాత విశాఖ యోగం వృద్ధి ఉ. 10:43 వరకు కరణం వనిజ ఉ. 7:32 వరకు విష్టి రా. 8:46 వరకు వర్జ్యం సా. 4:55 నుండి సా. 6:42 వరకు దుర్ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు రాహుకాలం మ. 12:30 నుండి మ. 1:56 వరకు యమగండం ఉ. 8:10 నుండి ఉ. 9:37 వరకు గుళికాకాలం ఉ. 11:03 నుండి మ. 12:30 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:08 నుండి తె.5:56 వరకు అమృత ఘడియలు తె. 3:38 నుండి తె. 5:26 వరకు అభిజిత్ ముహూర్తం లేదు.




అనుపమ బర్త్ డే.. పరదా టీమ్ స్పెషల్ విషెస్

అనుపమ పరమేశ్వరన్

సినీ కబుర్లు




# స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కీలక ఒప్పందం



- అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్‌ఐసీసీలో గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు
- ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు
- బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు

**ఈ-కబురు, హైదరాబాద్:**

స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్ కు చెందిన గోయాస్ హబ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్‌ఐసీసీలో గో యాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ పౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్ తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.



## శివమ్ దూబే విజృంభణ.. కీలక మ్యాచ్‌లో ఐదు వికెట్లు

ఆట

## టీసీఎస్ వీసా ఫ్రాడ్ చేసింది..

మాజీ ఉద్యోగుల ఆరోపణలు

బిజినెస్



## అమ్మమ్మ ఇచ్చిన చీరతో..

- సాయి పల్లవి

సినిమాలో..

# కోడ్ లేని జిల్లాల్లో రేషన్‌కార్డులివ్వండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కోడ్ ముగిశాక మిగిలిన జిల్లాల్లోనూ చేపట్టాలన్నారు.
- కొత్త కార్డులకు జారీకి పలు డిజైన్లను పరిశీలించారు
- పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితర అధికారులు పాల్గొన్నారు
- ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలి

**ఈ-కబురు, హైదరాబాద్:**



రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీకి వెంటనే ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో మొదట పంపిణీ ప్రారంభించి.. కోడ్ ముగిశాక మిగిలిన జిల్లాల్లోనూ చేపట్టాలన్నారు. సీఎం సోమవారం తన నివాసంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తులకు అవకాశమిచ్చినా, మీ సేవా కేంద్రాల వద్ద రేషన్ కార్డుల కోసం ఎందుకు రద్దీ ఉంటోందని సీఎం ప్రశ్నించారు. దరఖాస్తు చేసిన కుటుంబాలే మళ్లీ మళ్లీ చేస్తుండడమే దీనికి కారణమని అధికారులు వివరణ ఇచ్చారు. వెంటనే కార్డులిస్తే ఈ పరిస్థితి తలెత్తేది కాదని, వేగంగా జారీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. కొత్త కార్డులకు జారీకి పలు డిజైన్లను పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని గనుల శాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు తరచూ తనిఖీ చేయాలన్నారు. రీచ్‌ల వద్ద అక్రమ రవాణాపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెడతాం

ఇసుక రీచ్‌ల నుంచి జిల్లా రహదారులకు వచ్చే మార్గాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామని, ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు దాడులు నిర్వహిస్తామని మైనింగ్ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ పేర్కొన్నారు. ఇసుక అక్రమాల నివారణకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చిన నేపథ్యంలో మైనింగ్ శాఖ డైరెక్టర్ శశాంక, టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్‌లతో కలిసి శ్రీధర్ సోమవారం (మిగతా 2వ పేజీలో)



## సైబర్ నేరాల సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసుల ముందంజ

- సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యం
- హెచ్‌ఐసీసీలో నిర్వహించిన 'షీల్డ్ 2025' సదస్సు
- సీఎం రేవంత్‌రెడ్డి

**ఈ-కబురు, హైదరాబాద్:**

సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలకు పరిష్కారాలను కనుగొనడమే లక్ష్యంగా హెచ్‌ఐసీసీలో నిర్వహించిన 'షీల్డ్ 2025' సదస్సులో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో ప్రత్యేకమైన సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఏర్పాటు చేశాం. సైబర్ నేరాల్లో సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారు. గతేడాది సైబర్ నేరాల దర్యాప్తు కోసం కొత్తగా 7 పోలీసు స్టేషన్లు (మిగతా 2వ పేజీలో)

## ప్రధాని మోదీని కలిసిన రిషి సునాక్ కుటుంబం

**ఈ-కబురు, న్యూ ఢిల్లీ :**

బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్ భారత ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. కుటుంబ సభ్యులతో రిషి సునాక్ కలిసిన ఫొటోలను ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో షేర్ చేశారు. రిషి సునాక్, ఆయన కుటుంబ సభ్యులను కలవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ భేటీలో తమ మధ్య అనేక అంశాలపై అద్భుతమైన సంభాషణ జరిగిందన్నారు. రిషి భారత్‌కు గొప్ప మిత్రుడని, ఇరు దేశాల సంబంధాల బలపడాలని తపనకలిగిన వారంటూ మోదీ ప్రశంసించారు. రిషి సునాక్ వెంట ఆయన సతీమణి అక్షతామూర్తి, ఇద్దరు కుమార్తెలు, రాజ్యసభ ఎంపీ సుధామూర్తి ఉన్నారు. అంతకముందు రిషి సునాక్ కుటుంబ సభ్యులతో కలిసి పార్లమెంటు హౌస్‌ను సందర్శించారు. ఆయనకు లోక్‌సభ సెక్రటరీ జనరల్ (మిగతా 2వ పేజీలో)





## బీసీల జనాభా ఎందుకు తగ్గిందో రేవంత్ చెప్పాలి

- కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు
- కేంద్రం తెలంగాణకు భారీగానే నిధులు ఇచ్చింది
- రామగుండం ఎరువుల పరిశ్రమకు రూ.6,300 కోట్లు మంజూరు : ఎంపీ ఈటల రాజేందర్

2



## అర్ధరాత్రి వేళ నిర్ణయాలా

### సీఈసీ ఎంపికపై రాహుల్

**ఈ-కబురు, న్యూ ఢిల్లీ :**

భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్ నియమితులైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ఎంపికపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సీఈసీ ఎంపికపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతుండగానే.. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు అర్ధరాత్రి వేళ నిర్ణయం (మిగతా 2వ పేజీలో)

### కృష్ణాజలాలను ఏపీ అక్రమంగా తరలిస్తోంది

## కేంద్రం అడ్డుకోవాలి

- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు
- మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలి

2





## మరో ఐదు జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన భాజపా

- జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను కూడా నియమించింది
- మొత్తం మూడు విడతల్లో 28 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం..

**ఈ-కబురు, హైదరాబాద్:**

తెలంగాణలో భాజపా మరో ఐదు జిల్లాలకు పార్టీ అధ్యక్షులను ప్రకటించింది. జిల్లా అధ్యక్షులతో పాటు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను కూడా నియమించింది. మొత్తం మూడు విడతల్లో 28 జిల్లాలకు అధ్యక్షులను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం.. మరో 10 జిల్లాలకు అధ్యక్షులను పెండింగ్‌లో పెట్టింది. భాజపాకు సంస్థాగతంగా తెలంగాణలో 38 జిల్లాలు ఉన్నాయి. నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా కె.సత్యయాదవ్, సూర్యపేట శ్రీలతరెడ్డి, సిద్దిపేట బైరి శంకర్ ముదిరాజ్, సిరిసిల్ల ఆర్.గోపి ముదిరాజ్ నియమితులయ్యారు.

# బీసీల జనాభా ఎందుకు తగ్గిందో రేవంత్ చెప్పాలి

## కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

**కేంద్రం తెలంగాణకు భారీగానే నిధులు ఇచ్చింది**

**రామగుండం ఎరువుల పరిశ్రమకు రూ.6,300 కోట్లు మంజూరు : ఎంపీ ఈటల రాజేందర్**



**ఈ-కబురు, హైదరాబాద్:**

రాష్ట్రాల వారీగా కులగణనకు భాజపా అనుకూలమని ఆ పార్టీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాష్ట్రంలో బీసీల జనాభా ఎందుకు తగ్గిందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఈటల మీడియాతో మాట్లాడారు. "కులగణనపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు భారీగానే నిధులు ఇచ్చింది. రామగుండం ఎరువుల పరిశ్రమకు రూ. 6,300 కోట్లు మంజూరు చేసింది. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తోంది. మేడిన్ ఇండియాకు ప్రాధాన్యం ఇస్తోంది. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు రూ.వేలకోట్ల రుణాలు మంజూరు చేస్తోంది. బయ్యారంలో రాష్ట్ర ప్రభుత్వమే ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయొచ్చు కదా?ప్రజలకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వమే పరిశ్రమ పెట్టొచ్చు కదా?" అని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు.



## శిథిలమైన నాళాలను పునరుద్ధరించాలి

**అదనపు కలెక్టర్ అరుణ శ్రీ**

**ఈ-కబురు, గోదావరిఖని:**

ఫిబ్రవరి 18 : మురుగు నీరు నిలిచిపోకుండా శిథిలమైన నాలాలను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఎసి) జె. అరుణ శ్రీ ఆదేశించారు. మంగళవారం రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 10, 38, 39 డివిజన్ లలో పర్యటించి ఉపరితల కాలువలను పరిశీలించారు. 2ఎ ఇంక్ లైన్ మోరీ వద్ద శిథిలమైన నాలా కారణంగా మురుగు నీరు నిలిచిపోయిన నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షా కాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా వరద నీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. 39 వ డివిజన్ లోని ఎన్‌టిపిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి చెత్త పేరుకుపోకుండా కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

## సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం

**సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం.**

**ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు, అభ్యర్థులు ఉన్నత విద్యావంతులు.**

**ఎన్నికల నిబంధనలు నిబంధనలపై అభ్యర్థులు అవగాహన కలిగి ఉంటారు.**

**ఎన్నికల సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి.**

**ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.**

**ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులు సిబ్బంది ఛాలెంజ్ గా తీసుకొని నిర్వర్తించాలి.**

**ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ బి.మహేష్ దత్ ఏక్కా**



**ఈ-కబురు, సంగారెడ్డి:**

ఫిబ్రవరి 18 : సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎన్నికలకు ఎంతో తేడా ఉంటుందని నిజామాబాద్, కరీంనగర్ అదిలాబాద్ మెదక్ జిల్లాల టీచర్స్ ఎన్నికల అబ్జర్వర్ మహేష్ దత్ ఏక్కా, పేర్కొన్నారు. మంగళవా రం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు, ఏఆర్ఓ అధికారులతో ఎన్నికల విధులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు తారా డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, అంబే ద్కర్ స్టేడియంలోని డిఆర్సి సెంటర్‌ను జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరుతో కలిసి పరిశీలించారు.సమీక్ష సమావేశం సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నిక లకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రత్యేకత ఉంటుందన్నారు ప్రతిసారి జరుగుతున్న ఎన్నికల్లో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని అన్నారు. ఎస్‌పిటి, ఎస్ఎస్‌టి, ఎస్ఓటి, ఎన్నిసి టీంల ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, సర్వే లైన్స్ టీమ్ ఏర్పాటు పనితీరు వివరాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు హాజరు కాని ఉద్యోగులకు షో కాజ్ నోటీసులు అందజేసి సస్పెండ్ చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికలకు సంబంధించి మొదటి, రెండవ రాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని, మూడవ రాండమైజేషన్ కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులు ఉన్నత విద్యావంతులని ఎన్నికల విధులను సాధారణ ఎన్నికల్లో కాకుండా ఇప్పుడు లేదు జాగ్రత్త వ్యవహరించాలని ఎన్నికల నిర్వహణను చాలెంజింగ్ గా తీసుకొని పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్ రావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లాలోని నోడల్ అధికారులు, ఆర్ ఓలు, తహసీల్దార్ లు, ఎన్నికల విభాగ అధికారులు, సంబంబధిత అధికారులు, పాల్గొన్నారు.



## ఇస్సాపల్లి పాఠశాలకు మైక్ సెట్ వితరణ

**ఈ-కబురు, నిజామాబాద్ :**

ఫిబ్రవరి 18 : నిజామా బాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి గ్రామ పాఠశాలకు ఆర్మూర్ మార్కెట్ కమి టీ వైస్ ఛైర్మెన్ ఇట్టం జీవన్ మంగ ళవా రం జడ్పిహెచ్ఎస్ ఇస్సాపల్లి పాఠ శాలకు 16వేల రూపాయల విలువగల మైక్ సెట్ సంబధిత సామాగ్రిని బహుక రించి తన ధాతృత్వాన్ని చాటుకున్నారు.ఈ సంద ర్భంగా పాఠశాల తరఫున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాజగంగారాం, ఇన్చార్జి ప్రధా నోపాధ్యాయులు జగదీశ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కృష్ణారెడ్డి, చిన్నయ్య, అరుంధతి, అర్పిత, కృష్ణ చైతన్య, రాము, రాజేష్, పాఠశాల సిబ్బంది పుష్ప, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాజలాలను ఏపీ అక్రమంగా తరలిస్తోంది.. కేంద్రం అడ్డుకోవాలి

- **నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**
- **కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు**
- **మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలి**

**ఈ-కబురు, హైదరాబాద్:**

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరగకుండా కేంద్రం తక్షణమే జోక్యం చేసుకోవాలని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. ఏపీ ప్రభుత్వం కృష్ణాజలాలను అక్రమంగా తరలిస్తోందని, కేంద్రం అడ్డుకోవాలన్నారు. జయపురలో కేంద్ర జలశక్తిశాఖ ఆధ్వర్యంలో జరిగిన నీటిపారుదలశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న ఉత్తమ్.. నీటి నిల్వ సదుపాయాలు, నీటి సరఫరా నిర్వహణపై ప్రజెంటేషన్ ఇచ్చారు.



కృష్ణా జలాల వినియోగాన్ని లెక్కించేందుకు టెలిమెట్రీ ఏర్పాటు చేయాలని కోరారు. 55 కిలోమీటర్ల పొడవునా చేపడుతున్న మూసీ పునరుజ్జీవ, అభివృద్ధి ప్రాజెక్టుకు కేంద్రం నిధులివ్వాలని.. గంగా, యమునా పునరుద్ధరణ తరహాలో మూసీ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని మంత్రి అన్నారు. మూసీ వెంట ట్రంక్, సీవరేజ్ నెట్ వర్క్ కోసం రూ.4వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌కు గోదావరి జలాలను తరలించే పనులకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని కోరారు.

కృష్ణా ట్రైబ్యునల్ తీర్పు త్వరగా వచ్చేలా కేంద్రం చొరవ తీసుకొని తెలంగాణకు న్యాయం చేయాలన్న ఉత్తమ్.. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, సీతారామసాగర్ ప్రాజెక్టులకు నీటి కేటాయింపుల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పనులు కొనసాగుతోన్న సాగునీటి ప్రాజెక్టులకు తక్కువ వడ్డీతో రుణాలు సమకూర్చాలని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లో పూడికతీతకు అయ్యే వ్యయాన్ని కేంద్రమే భరించాలని కోరారు. మేడిగడ్డ ఆనకట్టకు సంబంధించి ఎన్డీఎస్ఏ విచారణ నివేదిక త్వరగా ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తగిన కార్యాచరణ సూచించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రధాని మోదీని కలిసిన రిషి సునాక్ కుటుంబం

(మొదటి పేజీ తరువాయి)



ఉత్పల్ కుమార్ సింగ్ సాదర స్వాగతం పలికారు. పార్లమెంటు హౌస్ నిర్మాణ వైభవాన్ని తిలకించడంతో పాటు పలు గ్యాలరీలు, ఉభయ సభల గదులు, కాన్‌స్టిట్యూషన్ హాల్, సంవిధాన్ సదన్‌లను సందర్శించారు. భారత్ పర్యటనలో ఉన్న రిషి ఇటీవల తాజ్ మహల్‌ను సందర్శించిన విషయం తెలిసిందే.

## కోడ్ లేని జిల్లాల్లో రేషన్‌కార్డులివ్వండి

(మొదటి పేజీ తరువాయి)



విలేకరులతో మాట్లాడుతూ... 'ఇసుక గుత్తేదారులతో సమావేశం ఏర్పాటు చేసి.. ఓవర్‌లోడ్ చేయకుండా చర్యలు తీసుకుంటాం. తప్పులు జరిగితే ఆ గుత్తేదారు సంస్థను బ్లాక్‌లిస్టులో పెడతాం. నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఇసుకను 24 గంటలూ బుకింగ్ చేసుకోవచ్చు. ఇసుక సరఫరా చేసే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అమర్చుతాం. 45 రోజుల్లో అక్రమాలన్నిటినీ అదుపు చేస్తాం. ఇసుక సరఫరా అక్రమాలపై 98480 94373, 70939 14343 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు. వీడియో తీసి ఆధారాలను పంపించవచ్చు' అని పేర్కొన్నారు.

## అర్ధరాత్రి వేళ నిర్ణయాలా..

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవడం సరికాదన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా ఓ పోస్టు చేశారు. 'తదుపరి ఎన్నికల కమిషనర్ ఎంపికకు కమిటీ సమావేశంలో మోదీ, అమిత్‌షాలకు అభ్యంతరాల నివేదికను అందించాం. కార్యనిర్వాహక వ్యవస్థ జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల కమిషన్‌లో అత్యంత ప్రాథమిక అంశం ఎన్నికల సంఘం కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ. సుప్రీంకోర్టు ఆదేశాలు ఉల్లంఘిస్తూ.. అర్ధరాత్రి వేళ నూతన సీఈసీని ఎంపిక చేశారు. ఇది మన ఎన్నికల ప్రక్రియపై కోట్లాది ప్రజల్లోని ఆందోళనలను తీవ్రతరం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకంపై సుప్రీంకోర్టులో 48 గంటల్లో విచారణ జరగనుంది. ఈ క్రమంలో మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయం సరికాదు' అని రాహుల్ రాసుకొచ్చారు. భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి నియమితులయ్యారు. మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ (ఈసీ) పదవిని చేపట్టబోయే వ్యక్తుల పేర్లను ఖరారు చేసింది. ఈ కమిటీలో ప్రధాని మోదీతోపాటు కేంద్ర మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సభ్యులుగా ఉన్నారు. సీఈసీ, ఈసీ పదవులకు ఎంపిక చేసిన పేర్లను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సిఫార్సు చేయగా ఆమె ఆమోదం తెలిపారు.



కొత్త చట్టం ప్రకారం సీఈసీని నియమించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై ఈ నెల 19న విచారణ జరగనుంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణ ముగిసే వరకు కొత్త సీఈసీపై నిర్ణయాన్ని వాయిదావేయాలని త్రిసభ్య కమిటీ సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ సూచించినట్లు సమాచారం.

## .. సైబరాబాద్ పోలీసుల ముందంజ

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటు చేశాం. ఒకప్పుడు ఇంట్లో చొరబడి మాత్రమే దోపిడీలు చేసేవారు. ఇప్పుడు దొంగలు ఎక్కడో ఉండి.. మన సొమ్ము దొంగిలిస్తున్నారు. నేరం ఎక్కడి నుంచి ఎవరు చేశారో కనుక్కోవడం పెద్ద సవాలుగా మారింది. నేరాల శైలి మారుతోంది. వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలి " అని అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. "సాంకేతికతతో మరిన్ని అవకాశాలు లభిస్తాయి. అయితే దానితో కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్, ర్యాన్సమ్‌వేర్, మాల్‌వేర్ వంటివి ఆందోళన కలిగిస్తున్నాయి. సాంకేతికత రెండు వైపులా పదును ఉన్న కత్తిలాంటిది. సైబర్ దాడుల వల్ల ఎన్నో వ్యవస్థలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఎయిమ్స్‌పై సైబర్ దాడి జరిగింది. అమెరికాలో జరిగిన సైబర్ దాడితో విమాన రాకపోకలు స్తంభించాయి. సైబర్ నేరాల వల్ల రూ.15 వేల కోట్లను భారత్ నష్టపోతోంది" అని మంత్రి అన్నారు. 14 రాష్ట్రాల నుంచి పోలీసు అధికారులు ఈ కాన్‌క్లేవ్‌కు హాజరు కావడం ఆనందంగా ఉందని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ అన్నారు. "సైబర్ నేరాలు యూనివర్సల్ ఛాలెంజ్‌గా మారాయి. వీటిని అరికట్టేందుకు ఈ కాన్‌క్లేవ్ ఒక మంచి వేదిక. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నాం. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పనితనానికి కేంద్రం అవార్డులు కూడా ఇచ్చింది. 2024లో సైబర్ నేరాల్లో కాజేసిన రూ.350 కోట్లు సీజ్ చేస్తాం. రూ.183 కోట్లను 18 వేల మంది బాధితులకు అందించాం" అని వివరించారు.





# బాలికలు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ఈ-కబురు, కరీంనగర్ :**

ఫిబ్రవరి 18 : బాలికలకు చదువుతోనే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని, లక్ష్యాన్ని నిర్దేశం చుకుని చదివినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు.కాశ్మీర్ గడ్డలోని ప్రభుత్వ ఎస్సీ కాలేజ్ గర్ల్స్ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మంగళవారం రాత్రి సందర్శించారు.హాస్టల్ లోని మెస్, బాలికల వసతి గదులను, ఆర్వో వాటర్ ప్లాంటు పరిశీలించారు.హాస్టల్ లో కామన్ మెనూ ప్రకారం పోషకాహారం ఇస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్, మెస్, స్టడీ, ఫుడ్ కమిటీలపై వాకబు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున విద్యార్థులకు అన్ని హాస్టళ్లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, కామన్ డైట్ మెనూ ద్వారా సమతుల పోషకాహారం అందిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు ఈ సౌకర్యాలన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుకు అవసరమయ్యే కెరియర్ ఆప్షన్ చాట్ ను విద్యార్థులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. కెరియర్ చాట్ ద్వారా విద్యార్థులకు ఉన్న ఉపాధి అవకాశాల గురించి వివరించారు.

ఈ సందర్భనలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డిఓ మహేశ్వర్, ఎస్సీ వెల్ఫేర్ ఈడి నాగార్జున, జిల్లా బిసి సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, హాస్టల్ ప్రత్యేక అధికారి రాంబాబు, వార్డెన్ విజయలక్ష్మి పాల్గొన్నారు.




# న్యాయవాదులకు అండగా వుంటా

**పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బగోని అశోక్ గౌడ్**

**ఈ-కబురు, నిజామాబాద్ :**

ఫిబ్రవరి 18 : తనను గెలిపిస్తే న్యాయవా దులకు అండగా వుంటానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బగోని అశోక్ గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మెదక్ అదిలాబాద్ కరీంనగర్ నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బగోని అశోక్ గౌడ్ రాష్ట్ర బీసీ నాయకులు బాస రాజేశ్వర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కేంద్రంలో గల న్యాయవాదులను కలిసి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా అబ్బగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ... తనను గెలిపిస్తే న్యాయవాదుల కొరకు అండగా నిలుస్తానని వారి పక్షాన పోరాడుతానని న్యాయవాదులను కలిసి తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ అడ్వకేట్లకు 10000 స్టైఫండ్ ఇవ్వాలని, వారికి లైబ్రరీలను కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరంతరం న్యాయం కోసం పోరాడే న్యాయవాదులకు జరుగుతున్నటువంటి దాడులను రక్షణ కల్పించాలని అబ్బ గోని అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. వారిని కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరించాలని అవసరమైతే సెక్యూరిటీ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారి పక్షాన అండగా ఉంటానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అబ్బగోని అశోక్ గౌడ్ తెలియజేశారు.




# నీటి నాణ్యత పై అవగాహన సదస్సు

**ఈ-కబురు, నిర్మల్ :**

భూగర్భ జలశాఖ, నిర్మల్ జిల్లా వారి ఆధ్వర్యములో మంగళవారం వ్యవసాయ పరిశోధన కేంద్రం, ముధోల్ లో సంచార నీటి నాణ్యత ప్రమోగశాల ద్వార (మొబైల్ వాటర్ క్వాలిటీ ల్యాబ్ తెలంగాణ ప్రభు త్వం) నీటి నాణ్యతపై అవగాహణ సదస్సు నిర్వహించారు. ఇందులో వ్యవసాయదారులు, వ్యవసాయ కళాశాల విద్యారులు, వినియోగ దారులు పొల్గోని భూగర్భజల నివృ త్తి వారికి నీటీ నాణ్యతపై 'గల సందేహాలను తేలియ జేశారు. ఈ సమావేశములో భూగర్భ జలశాఖ ఉప సంచాలకలు పి శ్రీనివాసు బాబు, ముధోల్ వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి డా.ఈ.నర్సయ్య, డా.కె.విజయ్ కుమార్, శాస్త్రజ్ఞులు డా.కార్మిక్, ముథోల్ మహిళ ఎఫ్‌పిఓ సభ్యులు, కుమారి కే. సుహాసిని, సహాయ జలాధికారి, స్థానిక రైతులు (కే.దత్తాతి) పాల్గొన్నరు.

# వేసవిలో సాగు, త్రాగు నీటి సమస్య లేకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి**

**ఈ-కబురు, హైదరాబాద్ :**



ఫిబ్రవరి 18 : రానున్న వేసవికాలంలో సాగునీ టికి, త్రాగునీటికి ఎలాంటి సమస్య లేకుండా ప్రణాళికబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు.మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, రైతు భరోసా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటి సరఫరాకు చర్యలు తీసుకోవడంతో పాటు రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలంలో వ్యవసాయానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని, అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కొరకు అందిన దరఖాస్తులలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న జిల్లాలను మినహాయించి మిగతా జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు రేషన్ కార్డులు అందించాలని తెలిపారు. ప్రభుత్వ, గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. దినపత్రికలు, సోషల్ మీడియాలలో వచ్చే ప్రతికూల వార్తలపై సంబంధిత అధికారుల సమన్వయంతో స్పందించి తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాలకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళికిలోబడి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు శ్రీకారం చుట్టిన రాష్ట్రం తెలంగాణ

**రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా**

**మంత్రి దామోదర ను కలిసి సన్మానం చేసిన ఎస్సి ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు**

**భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**



**ఈ-కబురు, యాదాద్రి భువనగిరి :**

ఫిబ్రవరి 18 : దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు శ్రీకారం చుట్టింది తెలంగాణ రాష్ట్రమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ల ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని త్వరలోనే చట్టరూపం దాల్చాలని మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్ మాజీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకుల బృందం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను మంగళవారం కలిశారు. అనంతరం శాలువాతో సన్మానం చేశారు.ఎస్సీ వర్గీకరణ అమలు ద్వారా మాదిగ అనుబంధ కులాలు విద్య,ఉద్యోగ రంగాలలో అవకాశాలు పెరుగుతాయని వర్గీకరణ వల్ల ఏ కులానికి అన్యాయం జరగ దని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. బేగంపే టలోని టూరిజం ప్లాజాలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు మాదిగ అనుబంధ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశానికి మంత్రి పాల్గొని మాట్లాడారు.సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం దేశంలోని ఎస్సీ వర్గీకరణ అమలుకు శ్రీకారం చుట్టిన తొలి రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటంలో అమరులైన వారి కుటుంబ సభ్యులను మంత్రి సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీరే శం, కవ్వంపల్లి సత్యనారాయణ, లక్ష్మి కాంతారావు, మాజీ మంత్రులు మోత్కుపల్లి నరసింహులు, చంద్రశేఖర్, ఆచార్య మల్లేశం మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు. అణగారిన కులాల్లో సామాజిక న్యాయం కోసం ఎస్సీ వర్గీకరణ ను మూడు గ్రూపులుగా సెన్సెస్ 2011 ఆధారంగా వర్గీకరణ చేశామని వర్గీకరణ వల్ల ఎవరికి అన్యాయం జరగలేదని ఏక సభ్య కమిషన్ జస్టిస్ షమీము అక్తర్ రిపోర్ట్ ప్రకారం అమలు చేయడం జరుగుతుందని దేశంలోనే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక గట్టి నిర్ణయం తీసుకొని అసెంబ్లీలో ఆమోదం చేయించారని 2011వ సెన్సెస్ ప్రకారము ఎస్సీ కులాలు దాదాపు 53 లక్షల జనాభాను దృష్టిలో పెట్టుకొని మాదిగలు, మాదిగ ఉపకులాలు వారికి చెందాల్సిన సరైన న్యాయం ప్రకారం 3 గ్రూపులుగా ఏర్పాటు చేశామని గతంలో 2000 సంవత్సరంలో ఏబిసిడిఎస్సి వర్గీకరణ సరైన మార్గంలో జరగలేదని కోర్టు తీర్పు వల్ల 2004 రద్దు చేశారని 2005 సం.లో డా.వైయస్ రాజశేఖర రెడ్డి ఉష మెహ్రా కమిషన్ వేసి రాజ్యాంగ బద్ధంగా ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని పలు సూచనలు సలహాలు ఇచ్చామని ప్రస్తుతము మూడు గ్రూపులలో మొదటిదైన దానిలో 15 ఉపకులాలు 1,75 625 జనాభా గల కమ్యూనిటీకి ఒక శాతంగా మరియు రెండో గ్రూపులో 18 మాదిగ ఉప కులాలను 32 లక్షల 74, 377 జనాభా గల 9% మరియు మూడో గ్రూపులో 26 కులాలు 17 లక్షల 71 వేల 766 జనాభాకు 5%లు గా వర్గీకరణ చేశామని మొత్తం 59 కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించామన్నారు. దేశంలోనే చేసినటువంటి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ కులాలు మరియు మాదిగ ఉపకు లాలు అందరూ కూడా ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని బర్రె జహంగీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కులాల నాయకులు బండారు రవి వర్ధన్, తొంట సత్యనారాయణ, కోటేశ్వరి, తొంట కృష్ణ, బొడ్డు కృష్ణ, బుగ్గ మైసయ్య బండారు అశోక్ వర్ధన్,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# జిల్లాలో 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఈ-కబురు, మంచిర్యాల :**

జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బంధీగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ యాదయ్య లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో 10వ తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మార్చి 21 నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు 10వ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపో సిట్ పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.50 గంటల వరకు, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 11 గంటల వరకు మినహా మిగతా పరీక్షలు ఉద యం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 9 వేల 189 మంది రెగ్యులర్, 221 మంది ఒక్కసారి అనుత్తీర్ణులైన విద్యార్థులు పరీక్ష రాయను న్నారని, పరీక్షల నిర్వహణలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందా లను నియమించడం జరిగిందని తెలిపారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్ష సమయంలో 144 సె క్షన్ అమలు చేయడం జరుగుతుందని, పరీక్ష కేంద్రాల సమీ పంలోని జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకో వాలని తెలిపారు. పరీక్ష సమయానికి అనుకూలంగా టిజిఎస్ ఆర్టిసి అధికారులు బస్సు సౌకర్యం కల్పించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు పర్యవేక్షించాలని, ప్రతి పరీక్ష కేంద్రంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, ప్రశ్నా, జవాబు పత్రాల సురక్షిత రవాణా కొరకు తపాలా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

**విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**ఈ-కబురు, కరీంనగర్ :**



ఫిబ్రవరి 18 : రానున్న పదవ తరగతి పరీక్షల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధతపై మంగళవారం మండల విద్యాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం పదవ తరగతి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించాలని అన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి పరీక్షలు పూర్తయ్యే వరకు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపవలసిందిగా కోరాలని అన్నారు. నాలుగు మోడల్ ప్రశ్నపత్రాలను ప్రత్యేకంగా తయారుచేసి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని ఎంఈఓ లకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఎంఈఓలను ఆదేశించారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు వంటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం విద్యార్థులు అలసిపోకుండా స్నాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల చదువును పర్యవేక్షించాలని అన్నారు. హాస్టల్ లోని విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని తెలిపారు. కామన్ డైట్ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారో లేదో తనిఖీ చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్ళను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



# పాపన్నపేట మండలంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ

**భూ పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

**ఈ-కబురు, మెదక్ :**

ఫిబ్రవరి 18 : మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాపన్నపేట మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా పాపన్నపేట మండలంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమికి సంబంధించి వివిధ ప్రదేశాలను సంబంధిత ఆర్డీఓ రమాదేవి, ఇంచార్జ్ తాసిల్దార్ మహేందర్ గౌడ్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా రాహుల్ రాజ్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుండి 15 ఎకరాల భూమిని గుర్తించేందుకు పాపన్నపేట మండలంలో తమ్మాయిపల్లి గ్రామం,పాపన్నపేట గ్రామంలోని భూమిని పరిశీలించడం జరిగిందని తెలిపారు.అనువైన భూమికి సంబంధించి భూపరిపాలన విభాగం హైదరాబాద్ వారికి ప్రతి పాదనలు పంపించాలన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సంబంధిత రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భువనగిరిలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేస్తాం

**సీనియర్ కాంగ్రెస్ నాయకులు తంగెలపల్లి రవికుమార్**

**ఈ-కబురు, యాదాద్రి భువనగిరి :**

ఫిబ్రవరి 18 : భువనగిరిలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం ఏర్పాటు చేస్తామని సీనియర్ కాంగ్రెస్ నాయకులు తంగెలపల్లి రవికుమార్ పేర్కొన్నారు. భువనగిరి విశ్వకర్మ వడ్రంగి సంఘం అధ్యక్షులు చెన్నోజు నరేంద్ర చారి ఆధ్వర్యంలో మన విశ్వకర్మ బంధువు టిపిసిసి డెలికేట్ ఉమ్మడి నల్గొండ జిల్లా ప్లానింగ్ బోర్డ్ మెంబర్ తంగళ్ళపల్లి రవికుమార్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడ్డ భువనగిరి విశ్వకర్మ వడ్రంగి సంఘం అధ్యక్షులు చెన్నూరు నరేందర్‌చారి కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కమిటి సభ్యులు ఉపాధ్యక్షులు ఉప్పల జ్ఞానేశ్వర్, బాషపల్లి ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పాములపర్తి లక్ష్మీనారాయణ, కోశాధికారి రాళ్ల బండి శ్రీధర్ చారి, సహాయ కార్యదర్శులు భాష పల్లి లక్ష్మణాచారి, కాసోజు పాండురంగచారి, మహంకాళి సురేష్ చారి సంఘం గౌరవ సలహాదారులు రాళ్ల బండి బాలచారి, గన్నెముక్కల బిక్షపతి, మీడియా మిత్రులు కూరెళ్ళ మల్లేష్ చారి, వీరవెల్లి రమేష్చారి, సంఘం సభ్యులు చేపర్తి నరసింహచారి పాల్గొన్నారు.

# టీసీఎస్ వీసా ఫ్రాడ్ చేసింది..

## మాజీ ఉద్యోగుల ఆరోపణలు

దేశంలో అతిపెద్ద ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ వీసా మోసం ఆరోపణలను ఎదుర్కొంటున్నట్లు సమాచారం. అమెరికా కార్మిక చట్టాలను పక్కదారి పట్టించేందుకు కంపెనీ ప్రత్యేక వర్క్ వీసాలను దుర్వినియోగం చేసిందని విజిల్‌బ్లోయర్లు ఆరోపిస్తున్నారు. ఫ్రంట్‌లైన్ కార్మికులను అమెరికాకు తీసుకురావడానికి వారిని మేనేజర్లుగా ముద్ర వేసి ఎల్-1ఏ మేనేజర్ వీసాలను దుర్వినియోగం చేసిందని వ్యాజ్యాలతోపాటు బ్లూమ్‌బెర్గ్ న్యూస్ ఇన్వెస్టిగేషన్‌లోనూ ఆరోపించారు.

2017లో డోనాల్డ్ ట్రంప్ పరిపాలన ఎంప్లాయిమెంట్ వీసాలపై దృష్టి సారించినప్పుడు, కంపెనీ ఎగ్జిక్యూటివ్‌లు అంతర్గత సంస్థాగత చార్ట్‌లను తప్పుగా రూపొందించాలని తనకు సూచించారని డెన్వర్‌లో టీసీఎస్‌కు ఐటీ మేనేజర్‌గా పనిచేసిన అనిల్ కిని ఆరోపించారని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది. ఫెడరల్ పరిశీలనను తప్పించుకోవడానికి ఫ్రంట్‌లైన్ ఉద్యోగులను మేనేజర్‌లుగా తప్పుగా చూపించడమే దీని ఉద్దేశమని బ్లూమ్‌బెర్గ్ నివేదించింది.

అనిల్ కిని, మరో ఇద్దరు మాజీ టీసీఎస్ ఉద్యోగులతో కలిసి ఫెడరల్ ఫాల్స్ క్లెయిమ్స్ యాక్ట్ కింద దావాలు దాఖలు చేశారని, కంపెనీ ఎల్-1ఏ వీసా వ్యవస్థను దుర్వనియోగం చేస్తోందని ఆరోపించారని నివేదిక పేర్కొంది. మేనేజర్ స్థాయి అధికారుల బదిలీల కోసం ఉద్దేశించిన ఈ వీసాలు, కఠినమైన వేతనం, విద్యా అవసరాలు కలిగిన హెచ్-1బీ నైపుణ్యం కలిగిన కార్మిక వీసాల కంటే తక్కువ నియంత్రణలు కలిగి ఉంటాయి. అనిల్ కిని దావాను ఈ సంవత్సరం ప్రారంభంలో కొట్టివేసినప్పటికీ ఆయన ఈ నిర్ణయాన్ని అప్పీల్ చేశాడని నివేదిక వివరించింది.

2019 అక్టోబర్, 2023 సెప్టెంబర్ మధ్య యూఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (%ఖుజ×ూ%) 90,000 కంటే ఎక్కువ ఎల్-1ఏ వీసాలను ఆమోదించింది. వీటిని ప్రధానంగా ఐటీ అవుట్‌సోర్సింగ్ సంస్థలు యూఎస్ కంపెనీలకు సమాచార సాంకేతిక పనులను నిర్వహించడానికి ఉపయోగించాయి. వీటిలో 6,500 కంటే ఎక్కువ ఎల్-1ఏ వీసాలతో టీసీఎస్ అగ్రస్థానంలో ఉంది. తరువాతి ఏడు అతిపెద్ద గ్రహీతలు కలిపి పొందిన ఎల్-1ఏ వీసాల కంటే టీసీఎస్ ఒక్కటే పొందిన ఎల్-1ఏ వీసాల సంఖ్య అధికం.

### ఖండించిన టీసీఎస్

తమపై వచ్చిన ఆరోపణలను టీసీఎస్ తీవ్రంగా ఖండించింది. "కొనసాగుతున్న వ్యాజ్యాలపై టీసీఎస్ వ్యాఖ్యానించదు. అయితే కొంతమంది మాజీ ఉద్యోగుల ఈ తప్పుడు ఆరోపణలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. వీటిని గతంలో అనేక కోర్టులు, ట్రిబ్యునళ్లు తోసిపుచ్చాయి. టీసీఎస్ అన్ని యూఎస్ చట్టాలకు కట్టుబడి ఉంటుంది" అని కంపెనీ ప్రతినిధి ఒకరు చెప్పినట్లు వార్తా సంస్థ పేర్కొం





## జియో థింగ్స్‌తో ప్యూర్ ఈవీ ఒప్పందం

ప్రముఖ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారు ప్యూర్ ఈవీ తన ఉత్పత్తుల్లో స్మార్ట్ డిజిటల్ క్లస్టర్లను ఏకీకృతం చేయడానికి జియో ప్లాట్‌ఫామ్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జియో థింగ్స్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం వల్ల అధునాతన ఐఓటీ(ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్) పరిష్కారాలు, అంతరాయం లేని కనెక్టివిటీ, పూర్తి డిజిటల్ ఇంటిగ్రేషన్‌ను అందించేందుకు తోడ్పడుతుందని కంపెనీ తెలిపింది.

**జియోథింగ్స్ ఇంటిగ్రేషన్ సాయంతో ద్విచక్రవాహనంలో ఎంటర్‌టైన్‌మెంట్, నావిగేషన్ సేవలు వంటివాటిని వాయిస్ ద్వారా నియంత్రించవచ్చని సంస్థ పేర్కొంది. వాహనదారులు వారి ప్రాధాన్యతలకు అనుగుణంగా వాహనంలోని టెక్నాలజీ ఇంటర్‌ఫేస్‌ను మార్చుకోవచ్చు. అందుకోసం వాయిస్ కమాండ్లను ఉపయోగించవచ్చు. దాంతో మెరుగైన రైడింగ్ అనుభూతిని పొందవచ్చని కంపెనీ స్పష్టం చేసింది.**

ప్యూర్ ఈవీ జియోథింగ్స్ స్మార్ట్ డిజిటల్ క్లస్టర్ల సాయంతో ఎండ్-టు-ఎండ్ ఐఓటీ పరిష్కారాలు అందించేందుకు ప్రయత్నిస్తుంది. వాహనాల పనితీరును ట్రాక్ చేయడానికి 4%+% కనెక్టివిటీ ఎనేబుల్ చేసిన టెలిమాటిక్స్ ద్వారా రియల్ టైమ్‌లో వాహనం కండిషన్‌ను పర్యవేక్షించవచ్చు. ఇందుకోసం జియోథింగ్స్ 4జీ స్మార్ట్ డిజిటల్ క్లస్టర్ ఆండ్రాయిడ్ ఓపెన్ సోర్స్ ప్రాజెక్ట్ (ఏఓఎస్‌పీ) 'అవ్ని ఓఎస్'ను ఉపయోగిస్తుంది. ఇది రియల్ టైమ్ డేటా అనలిటిక్స్, టూ వీలర్ ఇంటర్‌ఫేస్ కస్టమైజేషన్, ఫుల్ హెచ్‌డీ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లే కంపాటబిలిటీని అందిస్తుంది. జియోస్టోర్, మ్యూజిక్ స్ట్రీమింగ్, వెబ్ బ్రౌజింగ్, హ్యాండ్స్ ఫ్రీ వాయిస్ అసిస్టెన్స్, నావిగేషన్, గేమింగ్‌తోపాటు మరెన్నో సదుపాయాలను అందిస్తున్నారు.

జియో థింగ్స్ ఐఓటీ టెక్నాలజీ సాయంతో ప్యూర్ ఈవీ ఉత్పత్తులను పరిశ్రమ అత్యున్నత ప్రమాణాలకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ డాక్టర్ నిశాంత్ డోంగారి అన్నారు. వాహనాల సామర్థ్యం, ఎలక్ట్రిక్ మొబిలిటీని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సంస్థ వినియోగదారులకు సాంకేతికత సాయంతో మెరుగైన కనెక్టివిటీ, ఫంక్షనాలిటీని అందించనున్నట్లు చెప్పారు.

## భారత్‌లో ప్రవేశించేందుకు సిద్ధమవుతున్న టెస్లా

**ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీ), పునరుత్పాదక ఇంధన రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా ఉన్న టెస్లా ఇంక్ భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతోంది. ఇటీవల భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ల మధ్య సమావేశం జరిగింది. ఈ నేపథ్యంలో కొన్ని వాణిజ్య అంశాలపై చర్చించారు. అందులో భాగంగా టెస్లా భారత్‌లో ప్రవేశానికి సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలిసింది. దాంతో త్వరలో దీనిపై నిర్ణయాలు తీసుకోబోతున్నట్లు సమాచారం. ఈ అనుమానాలకు ఊతమిచ్చేలా ముంబై, ఢిల్లీలో కస్టమర్ ఫేసింగ్, బ్యాకెండ్ పొజిషన్లలో పని చేసేందుకు 13 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు టెస్లా ప్రకటించింది. దాంతో టెస్లా భారత్‌లో ప్రవేశించేందుకు అడ్డంకులు తొలిగే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.**

టెస్లా భారతదేశంలో నియామకాలు చేపట్టాలని తీసుకున్న నిర్ణయం దేశంలో తన ఉనికిని స్థాపించే దిశగా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు. సర్వీస్ టెక్నీషియన్, టెస్లా అడ్వైజర్, ఇన్‌సైడ్ సేల్స్ అడ్వైజర్, స్టోర్ మేనేజర్, బిజినెస్ ఆపరేషన్స్ అనలిస్ట్ వంటి పోస్టులను ఈ మేరకు భర్తీ చేయనున్నారు. హైఎండ్ కార్లపై దిగుమతి సుంకాన్ని భారతదేశం ఇటీవల 110% నుంచి 70%కు తగ్గించిన తరువాత ఇలా నియామకాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. టెస్లా వంటి లగ్జరీ కార్ల తయారీదారులు మార్కెట్లోకి ప్రవేశించడం ఆర్థికంగా మరింత లాభదాయకంగా మారనుందని కొందరు అభిప్రాయపడుతున్నారు.

### భారత మార్కెట్లో అవకాశాలు

చైనా వంటి దేశాలతో పోలిస్తే భారత ఎలక్ట్రిక్ వాహనాల మార్కెట్ ఇంకా తక్కువగానే ఉంది. 2024లో ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు 1,00,000 యూనిట్లకు దగ్గరగా ఉన్నందున భారత ప్రభుత్వం ఈ రంగంలో మరింత వృద్ధి తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. అందుకోసం ఎలక్ట్రిక్ వాహన తయారీదారులకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. ఈ వ్యవహారం టెస్లాకు గణనీయమైన అవకాశాన్ని అందించనుంది. 2070 నాటికి నికర సున్నా ఉద్గారాలను సాధించడానికి దేశం కట్టుబడి ఉంది. అందుకోసం సుస్థిర ఇంధన పరిష్కారాలను ప్రోత్సహించడంలో భాగంగా టెస్లా వంటి కంపెనీలకు కేంద్రం ఆమోదముద్ర వేసే అవకాశాలు కనిపిస్తున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.

## నష్టాల్లో ముగిసిన స్టాక్‌మార్కెట్లు

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 75,531 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. కానీ చివరికి 29 పాయింట్ల స్వల్ప నష్టంతో 75,967 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 22,801 కనిష్ట స్థాయిని, 22,992 గరిష్ట స్థాయిని తాకి, ఆ తర్వాత 14 పాయింట్లు తగ్గి 22,945 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ 3 శాతం వరకు లాభపడి టాప్ పెర్ఫార్మర్‌లలో ఉన్నాయి. టెక్ మహీంద్రా, జొమాటో, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, కోటక్ మహీంద్రా బ్యాంక్ ఇతర స్పష్టమైన కదలికలు చేశాయి. మరోవైపు, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హిందుస్తాన్ యూనిలీవర్, అల్ట్రాటెక్ సిమెంట్, మహీంద్రా %డ% మహీంద్రా, టీసీఎస్ ఒక్కొక్కటి 1 - 2 శాతం క్షీణించాయి.

విస్తృత మార్కెట్లో బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ కూడా ఫ్లాట్ నోట్‌తో ముగిసింది. బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు 1.5 శాతం క్షీణించింది. మొత్తంగా ఈరోజు మార్కెట్ 3:1 నిష్పత్తిలో బేర్‌లకు అనుకూలంగా నష్టాలను చూసింది. బీఎస్ఈలో దాదాపు 3,000 స్టాక్‌లు క్షీణించగా , 1,000 కంటే తక్కువ షేర్లు లాభపడ్డాయి.





# సందీప్ కిషన్ 'మజాకా'.. పగలే చుక్కలే చూపిద్దామంటోన్న హీరో!

**టాలీవుడ్ హీరో సందీప్ కిషన్, రీతూవర్మ జంటగా నటించిన చిత్రం మజాకా. ఈ సినిమాకు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో మన్మథుడు హీరోయిన్ అన్షు కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీ నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది.**

ఈ సినిమాకు సంబంధించి క్రేజీ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'హేయ్ పగిలి పగిలి అంటూ సాగే' లిరికల్ పాటను రిలీజ్ చేశారు. ఈ మాస్ సాంగ్ ఆడియన్స్‌ను తెగ ఆకట్టుకుంటోంది. కాగా.. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మహాశివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న థియేటర్లలో విడుదల కానుంది. రిలీజ్ తేదీ దగ్గర పడడంతో మూవీ ప్రమోషన్లతో బిజీగా ఉన్నారు చిత్రబృందం. కాగా.. ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతమందించారు.



# సమంత వెబ్ సిరీస్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డ్

టాలీవుడ్ హీరోయిన్ సమంత నటించిన స్పై థ్రిల్లర్ వెబ్ సిరీస్ సిటాడెల్ హనీ బన్నీ . ఈ సిరీస్‌లో వరుణ్ ధావన్ సరసన నటించింది. ఈ వెబ్ సిరీస్ ప్రముఖ ఓటీటీ ఫ్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా ఈ సిరీస్ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రముఖ ఐకానిక్ గోల్డ్ అవార్డ్స్‌లో సత్తా చాటింది. బెస్ట్ వెబ్ సిరీస్‌గా అవార్డ్‌ను దక్కించుకుంది.

ఈ సందర్భంగా హనీ బన్నీ డైరెక్టర్ డీకే సంతోషం వ్యక్తం చేశారు. ఈ వెబ్‌సిరీస్ తీయడం వెనుక చాలా మంది కష్టముందని.. అవార్డుల రూపంలో మీరు చూపిస్తున్న ప్రేమకు ధన్యవాదాలు తెలిపారు. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌కు ఆడియన్స్ నుంచి మంచి టాక్ అయితే వచ్చింది. ఇందులో సమంత, వరుణ్ ధావన్ యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సిరీస్‌కు ప్రతిష్ఠాత్మక అవార్డ్ రావడంతో సమంత ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

## డేటింగ్ రూమర్స్..

కాగా.. సమంత ఇటీవల పికిల్ బాల్ లీగ్‌లో మెరిసింది. చెన్నైలో జరిగిన ఈవెంట్‌కు డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో కలిసి హాజరైంది. ఇద్దరూ కలిసి పికిల్ బాల్ కోర్టులో సందడి చేశారు. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మరోసారి డేటింగ్ రూమర్స్ వినిపించాయి. రాజ్ నిడిమోరుతో సమంత డేటింగ్ చేస్తున్నారని సోషల్ మీడియాలో పెద్దఎత్తున వార్తలొచ్చాయి.



# అనుపమ బర్త్ డే.. పరదా టీమ్ స్పెషల్ విషెస్

అనుపమ పరమేశ్వరన్ నటిస్తోన్న తాజా చిత్రం పరదా. ఈ చిత్రానికి ప్రవీణ్ కండ్రేగుల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను ఆనంద మీడియా బ్యానర్‌లో విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఓ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్.

ఇవాళ అనుపమ బర్త్ డే కావడంతో ఓ వీడియోను విడుదల చేశారు. దాదాపు 20 సెకన్లపాటు ఉన్న మూవీ క్లిప్‌ను షేర్ చేస్తూ అనుపమకు పుట్టినరోజ శు భాకాంక్షలు తెలిపారు. భిన్నమైన సోషియో ఫాంటసీ కథగా రానున్న ఈ చిత్రంలో అనుపమ సుబ్బు అనే పాత్రలో అభిమానులను అలరించనున్నారు. ఈ చిత్రంలో దర్శన రాజేంద్రన్, సంగీత కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# అమ్మమ్మ ఇచ్చిన చీరతో పెళ్లిపీటలు ఎక్కుదామనుకుంటే..

## - సాయి పల్లవి

సినిమాల్లో నటించే వారందరూ నటీనటులే. అయితే అందులో మంచి గుర్తింపు పొందే వారు మాత్రం కొందరే ఉంటారు. అలాంటి వారికి అవార్డులు అంగీకారమే కాకుండా, చాలా ప్రోత్సాహంగా ఉంటాయి. కాగా ఒక్కో సారి ప్రతిభావంతులైన నటీనటులకు కూడా ఉత్తమ అవార్డులు ఆలస్యంగానే వస్తుంటాయి. ఆ పట్టికలో నటి సాయిపల్లవి కూడా ఉన్నారు. ఈమె నటన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. నటించిన ప్రతిచిత్రంలోనూ తన ప్రత్యేకతను చాటు కుంటారు. సహజత్వానికి ప్రాధాన్యతనిస్తారు. ఇటీవల ఈమె నటించిన తమిళ చిత్రం అమరన్, తెలుగు చిత్రం తండేల్ ఒక ఉదాహరణ.

సినీ విజ్ఞులను సైతం తన నటనతో మెప్పిస్తున్న నటి సాయిపల్లవి. మలయాళం, తెలుగు, తమిళం భాషల్లో ప్రముఖ కథానాయకిగా రాణిస్తుంది. ఈమె ఇటీవల ఓ భేటీలో జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకోవాలనే కోరికను వ్యక్తం చేశారు. దీని గురించి సాయిపల్లవి తెలుపుతూ తనకు 21 ఏళ్ల వయసులో తన బామ్మ ఓ చీరను ఇచ్చారన్నారు. దాన్ని తన పెళ్లి రోజున కట్టుకోవమని చెప్పారన్నారు. అప్పటికి తను సినిమాల్లోకి రాలేదట, కాబట్టి పెళ్లి చేసుకున్నప్పుడు కట్టుకుందామనుకుని దానిని దాచిపెట్టినట్లు చెప్పింది. తనకు 23 ఏళ్ల వయసులో ప్రేమమ్ చిత్రంలో అవకాశం వచ్చినట్లు చెప్పింది. అయితే, ప్రేమమ్ విడుదల తర్వాత ఏదోక రోజు ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకుంటానని నమ్మకం కలిగినట్లు చెప్పుకొచ్చింది.

చిత్ర పరిశ్రమలో అంత గొప్ప అవార్డు జాతీయ అవార్డే కాబట్టి అందుకోసం కష్టపడుతానని ఆమె చెప్పింది. అందుకే దాన్ని దక్కించుకున్న రోజు అమ్మమ్మ చీర కట్టుకుని అవార్డుల ప్రదానోత్సవానికి హాజరు కావాలని నిర్ణయించుకున్నట్లు సాయి పల్లవి పేర్కొంది. ఆ అవార్డును గెలుచుకునే వరకూ తనకు ఆ భారం ఉంటుందని నటి సాయిపల్లవి పేర్కొన్నారు. అలా జాతీయ అవార్డుతో అమ్మమ్మ చీరకు ఒక కనెక్షన్ ఉండిపోయిందని నవ్వుతూ చెప్పింది.





# బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు భారత తుదిజట్టు ఇదే!

# రోహిత్ కోరుకుంటేనే అతడికి ఛాన్స్




**చాంపియన్స్ ట్రోఫీ-2025 టోర్నమెంట్‌కు టీమిండియా పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ మెగా ఈవెంట్లో టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగనున్న రోహిత్ సేనకు లీగ్ దశలోని మూడు మ్యాచ్‌లు కీలకమే. ఇందులో ఒక్కటి ఓడినా సెమీ ఫైనల్ చేరే అవకాశాలపై ప్రతికూల ప్రభావం ఉంటుంది.**

ఈ నేపథ్యంలో తుదిజట్టు ఎంపిక విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే మూల్యం చెల్లించాల్సి వస్తుందంటున్నాడు భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా. టీమిండియా ఈ టోర్నీలో ఆడబోయే తొలి మ్యాచ్‌కు తన ప్లేయింగ్ ఎలెవన్ ఇదేనంటూ యూట్యూబ్ వేదికగా అభిప్రాయాలు పంచుకున్నాడు.

## పేసర్ల విభాగంలో మాత్రం

జట్టులో ఇద్దరు స్పిన్ బౌలింగ్ ఆల్‌రౌండర్లతో పాటు ఓ స్పెషలిస్టు స్పిన్నర్ తప్పక ఉంటాడన్న ఆకాశ్ చోప్రా.. అయితే, ఈ విషయంలో కెప్టెన్, హెడ్‌కోచ్ ఎవరివైపు మొగ్గుచూపుతారన్నది చెప్పడం కాస్త కష్టమేనని పేర్కొన్నాడు. ఇక పేసర్ల విభాగంలో మాత్రం మొదటి ప్రాధాన్య ఆటగాడిగా అర్ష్‌దీప్ సింగ్‌కు తప్పక స్థానం దక్కుతుందని అంచనా వేశాడు.

కాగా 2017 తర్వాత తొలిసారిగా చాంపియన్స్ ట్రోఫీ జరుగనుంది. పాకిస్తాన్ వేదికగా ఈ వన్డే ఫార్మాట్ టోర్నీ మొదలుకానుండగా... టీమిండియా మాత్రం తమ మ్యాచ్‌లు దుబాయ్‌లో ఆడనుంది. ఇందులో భాగంగా గురువారం(ఫిబ్రవరి 20) రోహిత్ సేన తమ తొలి మ్యాచ్ ఆడనుంది. గ్రూప్-'ఎ'లో ఉన్న బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

ఈ నేపథ్యంలో భారత తుదిజట్టు కూర్పు గురించి ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. "రోహిత్ శర్మ- శుబ్‌మన్ గిల్.. కెప్టెన్, వైస్ కెప్టెన్.. ఓపెనర్లుగా వీరే ఉంటారు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ గురించి సందేహాలు అక్కర్లేదు. రన్ మెషీన్ కోహ్లి మూడో స్థానంలో వస్తాడు.

ఇక నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ ఆడతాడు. నా అభిప్రాయం ప్రకారం.. అక్షర్ పటేల్ ఐదు, కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో బ్యాటింగ్ చేస్తారు. హార్దిక్ పాండ్యా ఏడు.. రవీంద్ర జడేజా ఎనిమిదో స్థానంలో ఆడతారు.

**చాంపియన్స్ ట్రోఫీ-2025: టీమిండియా వర్సెస్ బంగ్లాదేశ్ మ్యాచ్‌కు ఆకాశ్ చోప్రా ఎంచుకున్న భారత తుదిజట్టు**
**రోహిత్ శర్మ(కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ/హర్షిత్ రాణా.**

# చరిత్ర సృష్టించిన టీమిండియా అండర్-19 స్టార్..

అండర్-19 టీమిండియా స్టార్ క్రికెటర్ జి.కమలిని సరికొత్త రికార్డు సాధించింది. వుమెన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత పిన్న వయసులో అరంగేట్రం చేసిన ప్లేయర్‌గా నిలిచింది. గుజరాత్ జెయింట్స్ వుమెన్‌తో మ్యాచ్ సందర్భంగా ముంబై ఇండియన్స్ వుమెన్ తరఫున ఈ తమిళనాడు క్రికెటర్ మంగళవారం(ఫిబ్రవరి 18) డబ్ల్యూపీఎల్‌లో అడుగుపెట్టింది.

## ఓటమితో మొదలుపెట్టిన ముంబై

కాగా గత శుక్రవారం(ఫిబ్రవరి 14) డబ్ల్యూపీఎల్-2025 ఎడిషన్ మొదలైన విషయం తెలిసిందే. మూడో సీజన్‌లో తొలుత గుజరాత్ జెయింట్స్- రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్



జరిగింది. ఇందులో బెంగళూరు జట్టు విజేతగా నిలవగా.. శనివారం నాటి మ్యాచ్‌లో ముంబై.. ఢిల్లీ కాపిటల్స్ చేతిలో ఓడిపోయింది.

అనంతరం ఆదివారం నాటి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్- యూపీ వారియర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ గెలుపొందింది. ఆ తర్వాత సోమవారం నాటి మ్యాచ్‌లో ఢిల్లీ జట్టును ఎదుర్కొన్న బెంగళూరు టీమ్ ఘన విజయం సాధించింది. ఈ క్రమంలో మంగళవారం నాటి మ్యాచ్‌లో గుజరాత్- ముంబై తలపడుతున్నాయి.

## ఇద్దరు ప్లేయర్ల అరంగేట్రం

వడోదరలోని కొటాంబి స్టేడియంలో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ వుమెన్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఇక టాస్ సందర్భంగా ముంబై కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. ఇద్దరు ప్లేయర్లు అరంగేట్రం చేస్తున్నట్లు వెల్లడించింది.




# శివమ్ దూబే విజృంభణ.. కీలక మ్యాచ్‌లో ఐదు వికెట్లు

**భారత స్టార్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే రంజీ ట్రోఫీ సెమీ ఫైనల్లో చెలరేగిపోయాడు. విదర్భతో జరుగుతున్న మ్యాచ్‌లో దూబే (ముంబై) ఐదు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు. తరుచూ బ్యాట్‌తో సత్తా చాటే దూబే ఈ మ్యాచ్‌లో బంతితో చెలరేగాడు. దూబే ధాటికి విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 383 పరుగులకు ఆలౌటైంది.**

ఓవర్‌నైట్ స్కోర్ 308/5 వద్ద రెండో రోజు ఆటను ప్రారంభించిన విదర్భ మరో 75 పరుగులు మాత్రమే జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయింది. తొలి రోజు ఆటలో 2 వికెట్లు తీసిన దూబే.. రెండో రోజు చెలరేగిపోయి మరో 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో దూబే.. పార్థ్ రేఖడే, కీలకమైన కరుణ్ నాయర్, హర్ష్ దూబే, భూటే, యశ్ ఠాకూర్ వికెట్లు తీశాడు. ముంబై బౌలర్లలో షమ్స్‌ములానీ, రాయ్‌స్టన్ డయాస్ తలో రెండు, శార్దూల్ ఠాకూర్ ఓ వికెట్ తీశారు.

**విదర్భ ఇన్నింగ్స్‌లో ధృవ్ షోరే (74), దినిశ్ మాలేవార్ (79), యశ్ రాథోడ్ (54) అర్ధ సెంచరీలతో రాణించగా.. కరుణ్ నాయర్ (45), కెప్టెన్ అక్షయ్ వాద్కర్ (34) ఓ మోస్తరు స్కోర్లు చేశారు. అథర్వ తైడే 4, పార్థ్ రేఖడే 23, హర్ష్ దూబే 18, భూటే 11, యశ్ ఠాకూర్ 3 పరుగులు చేసి ఔట్ కాగా.. దర్శన్ నల్కండే 12 పరుగులతో అజేయంగా నిలిచాడు.**

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబై.. 18 పరుగుల వద్దే తొలి వికెట్ కోల్పోయింది. దర్శన్ నల్కండే బౌలింగ్‌లో దనిశ్ మలేవార్‌కు క్యాచ్ ఇచ్చి ఆయుశ్ మాత్రే (9) ఔటయ్యాడు. ప్రస్తుతం ఆకాశ్ ఆనంద్ (7), సిద్దేశ్ లాడ్ (0) క్రీజ్‌లో ఉన్నారు. 4.4 ఓవర్ల అనంతరం ముంబై తొలి ఇన్నింగ్స్ స్కోర్ 18/1గా ఉంది. విదర్భ తొలి ఇన్నింగ్స్ స్కోర్‌కు ముంబై ఇంకా 365 పరుగులు వెనుకపడి ఉంది.

మరో సెమీఫైనల్లో గుజరాత్, కేరళ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేస్తున్న కేరళ భారీ స్కోర్ దిశగా పయనిస్తుంది. రెండో రోజు తొలి సెషన్ సమయానికి ఆ జట్టు 5 వికెట్ల నష్టానికి 293 పరుగులు చేసింది.మొహమ్మద్ అజహారుద్దీన్ (85), సల్మాన్ నిజర్ (28) క్రీజ్‌లో ఉన్నారు.

కేరళ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సచిన్ బేబి (69) అర్ధ సెంచరీతో రాణించగా.. అక్షయ్ చంద్రన్, రోహన్ కున్నుమ్మల్, జలజ్ సక్సేనా తలో 30 పరుగులు చేశారు. వరుణ్ నయనార్ 10 పరుగులకు ఔటయ్యాడు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నగస్వల్లా 2, పి జడేజా, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.

# చరిత్ర సృష్టించిన కేరళ క్రికెటర్

**అహ్మదాబాద్ వేదికగా గుజరాత్, కేరళ జట్ల మధ్య రంజీ ట్రోఫీ తొలి సెమీఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో కేరళ టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేస్తుంది. రెండో రోజు రెండో సెషన్ సమయానికి కేరళ 134.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 325 పరుగులు చేసింది. వికెట్‌కీపర్ మొహమ్మద్ అజహారుద్దీన్ (105 నాటౌట్), సల్మాన్ నిజర్ (40 నాటౌట్) బ్యాటింగ్ చేస్తున్నారు.**

కేరళ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ సచిన్ బేబి (69) అ ర్ధ సెంచరీతో రాణించగా.. అక్షయ్ చంద్రన్, రోహన్ కున్నుమ్మల్, జలజ్ సక్సేనా తలో 30 పరుగులు చేశారు. వరుణ్ నయనార్ 10 పరుగులకు ఔటయ్యాడు. గుజరాత్ బౌలర్లలో అర్జన్ నగస్వల్లా 2, పి జడేజా, రవి బిష్ణోయ్ తలో వికెట్ పడగొట్టారు.



## చరిత్ర సృష్టించిన అజహారుద్దీన్

ఈ మ్యాచ్‌లో సెంచరీతో కదంతొక్కిన మొహమ్మద్ అజహారుద్దీన్ రికార్డుబుక్కుల్లోకెక్కాడు. రంజీ సెమీఫైనల్లో సెంచరీ చేసిన తొలి కేరళ ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. రంజీల్లో కేరళ గతంలో ఒకే ఒక సారి సెమీస్‌కు చేరుకుంది. 2018-19 సీజన్‌లో కేరళ ఫైనల్ ఫోర్‌కు అర్హత సాధించింది. అయితే ఆ సీజన్ సెమీస్‌లో ఏ కేరళ ఆటగాడు సెంచరీ చేయలేదు. అజహారుద్దీనే రంజీల్లో కేరళ తరఫున సెంచరీ చేసిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడు.

ప్రస్తుత రంజీ సీజన్‌లో కేరళ అద్భుతమైన ప్రదర్శనలతో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. ఎలైట్ గ్రూప్-సిలో కేరళ 7 మ్యాచ్‌ల్లో 3 విజయాలు, 4 డ్రాలతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. క్వార్టర్ ఫైనల్లో కేరళ.. జమ్మూ అండ్ కశ్మీర్‌పై ఒక్క పరుగు ఆధిక్యం (తొలి ఇన్నింగ్స్‌లో) సాధించి సెమీస్ బెర్త్ దక్కించుకుంది.

# ఐర్లాండ్‌ను చిత్తు చేసిన జింబాబ్వే..

ఐర్లాండ్‌తో మూడో వన్డేలో జింబాబ్వే అదరగొట్టింది. ఏకంగా తొమ్మిది వికెట్ల తేడాతో ప్రత్యర్థి జట్టును మట్టికరిపించి ఘన విజయం సాధించింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది. కాగా ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడేందుకు ఐర్లాండ్ క్రికెట్ జట్టు జింబాబ్వే పర్యటనకు వచ్చింది.

ఈ క్రమంలో ఏకైక టెస్టులో ఐర్లాండ్ అనూహ్య రీతిలో విజయం సాధించగా.. ఆతిథ్య జింబాబ్వే తొలి వన్డేలో గెలుపుతో సిరీస్‌ను ఆరంభించింది. అనంతరం రెండో వన్డేలో ఐరిష్ జట్టు చేతిలో ఓడిన జింబాబ్వే తాజాగా నిర్ణయాత్మక ఆఖరి మ్యాచ్‌లో మాత్రం దుమ్ములేపింది. హరారే వేదికగా మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన జింబాబ్వే తొలుత బౌలింగ్ చేసింది.

## ఆండ్రూ బల్బిర్నీ, టెక్టర్, టకర్ అర్ధ శతకాలు

ఐర్లాండ్ ఓపెనర్లలో ఆండ్రూ బల్బిర్నీ అర్ధ శతకం(99 బంతుల్లో 64)తో రాణించగా.. మరో ఓపెనర్, కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ 9 పరుగులకే నిష్క్రమించాడు. ఇక వన్‌డౌన్ బ్యాటర్ కర్టిస్ కాంఫర్(11) కూడా త్వరగానే పెవిలియన్ చేరాడు. ఇలా జట్టు కష్టాల్లో కూరుకుపోయిన వేళ హ్యారీ టెక్టర్(51), వికెట్ కీపర్ బ్యాటర్ లోర్కాన్ టకర్(61) హాఫ్ సెంచరీలతో ఆదుకున్నారు.

మిగతా వాళ్లలో డాక్‌రెల్(2) విఫలంకాగా.. మార్క్ అడెర్ 26, ఆండీ మెక్‌బ్రిన్ 7 పరుగులతో అజేయంగా నిలిచారు. ఈ క్రమంలో నిర్ణీత యాభై ఓవర్లలో ఐర్లాండ్ జట్టు ఆరు వికెట్లు నష్టపోయి 240 పరుగులు సాధించింది. జింబాబ్వే బౌలర్లలో ఎంగర్వ, ట్రెవర్ గ్వాండు రెండేసి వికెట్లు కూల్చగా.. ముజర్బాని, వెల్లింగ్టన్ మసకద్జ ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.

